దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు, సెప్టెంబరు 9:తాండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 సంవత్సరానికి గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వసంతికుమారి తెలిపారు. అంగ్లం, తెలుగు, వాణిజ్యశాస్త్రం(ఇంగ్లీష్ మీడియం),వాణిజ్యశాస్త్రం(ఉర్దూ మీడియం), సబ్జెక్టుల్లో బోధనకు ఈనెల 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు.

రాజకీయ చైతన్యాన్ని తీసుకొచ్చిన

వ్యక్తి కాళోజీ

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



కాళోజీ చిత్ర పటానికి పూల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, సెప్టెంబరు 9 : ప్రజల్లో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని తీసుకొచ్చిన కాళోజీ కృషి మరువలేనిదని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. సోమవారం తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాళోజీ నారాయణరావు జయంతిని కలెక్టరేట్‌లో యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కాళోజీ నారాయణరావు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు ఆర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. సామాజిక సమస్యలపై నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా స్పందించే వ్యక్తిత్వం కాళోజీదన్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్తలు బందప్ప, నర్సప్పగౌడ్, సంగీతపు రాజలింగంలు కాళోజీ జీవనశైలి, కవిత్వంలో ఆయన వాడిన పదజాలంపై కవితా సంపుటితో వివరించారు. ఈ సందర్భంగా వారిని కలెక్టర్ శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ఆర్డీవో వాసుచంద్ర , డీవైఎస్‌వో హనుమంతరావు, ఉపేందర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు. అంతేకాకుండా ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 199 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం దిశగా అధికారులు పనిచేయాలన్నారు. అధిక వర్షాలతో దెబ్బతిన్న పంటల వివరాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు సమర్పించాలని తెలిపారు. ప్రభుత్వ భవనాలు, ఇళ్లు దెబ్బతిన్నట్లయితే వివరాలివ్వాలన్నారు.

కాళోజీ ఆశయాలు భవిష్యత్ తరాలకు ఆదర్శం

మేడ్చల్ అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



కలెక్టరేట్‌లో కాళోజీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న విజయేందర్‌రెడ్డి

మేడ్చల్ సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతిప్రతినిధి) : ప్రజల కోసం నిత్యం పరితపించిన కవితామూర్తి కాళోజీ అని, ఆయన ఆశయాలు భవిష్యత్ తరాలకు ఆదర్శమని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కాళోజి జయంతి సందర్భంగా కాళోజి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టుక నీది, చావు నీది బతుకంతా దేశానిది అన్న కాళోజీ మాటలు అందరికి ఆదర్శమని అన్నారు. కాగా ప్రజావాణిలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ గౌతమ్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో విజయేందర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ 89 దరఖాస్తులు స్వీకరించారు.



అలుగు నాలాను ఆనుకొని నిర్మించిన భవనాలు

పెద్దచెరువు అన్యాక్రాంతం!

సువిశాలమైన మేడ్చల్ పెద్ద చెరువు నేడు కబ్జా కోరల్లో చిక్కుకుంది. రియల్టర్లు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో దర్జాగా కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. భారీ వెంచర్లు సైతం ఏర్పాటు చేసి ప్లాట్లుగా చేశారు. ప్రస్తుతం చెరువు పూర్తిగా నిండటంతో బఫర్‌జోన్ లోని రోడ్లు, ప్లాట్లు నీటమునిగాయి. చెరువు ఉనికిని దెబ్బతీస్తున్న భూబకాసురలపై ఎటువంటి చర్యలూ లేకపోవడంతో ఈ ఆక్రమణలకు అడ్డే లేకుండా పోయింది. మరోవైపు చెరువుల రక్షణకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా కొరడా ఘుళిపిస్తుండటంతో మేడ్చల్ చెరువు పరిధిలోని కబ్జాలపై చర్యలకు స్థానికులు ఎదురుచూస్తున్నారు.

కబ్జాకోరల్లో మేడ్చల్ పెద్దచెరువు

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో భారీగా వెంచర్లు, నిర్మాణాలు

ప్రస్తుతం చెరువు నిండటంతో మునిగిన రోడ్లు

మాయమైన కాలువలు, అలుగు, నాలా

పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు

కబ్జాల పర్వం 10

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 9 : మేడ్చల్ పెద్ద చెరువు ఎల్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో పూర్తి స్థాయిలో కబ్జాకొరల్లో చిక్కుకుంది. ఇరిగేషన్ అధికారులు 2013లో చెరువు సర్వే నిర్వహించి అందుకు సంబంధించిన ప్లాన్‌ను హెచ్‌ఎండీఏ అధికారులకు నివేదించారు. 356 ఎకరాల్లో పెద్ద చెరువు విస్తీర్ణం ఉన్నట్లు నిర్ధారించారు. ఈ విస్తీర్ణంలో చెరువు శిఖంతో పాటు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల గురించి పూర్తి వివరాలు తెలియజేశారు. అయినా అధికారుల అలసత్వం, రాజకీయ పలుకుబడితో చెరువు పరిధిలో పెద్ద సంఖ్యలో నిర్మాణాలు, లేఅవుట్‌లు వెలిశాయి.

గతంలో ఇరిగేషన్ అధికారులు సర్వే నిర్వహించి చెరువు సరిహద్దులను గుర్తించి హద్దు రాళ్లను ఏర్పాటు చేశారు. కాగా రియల్టర్లు వాటిని తొలగించి ప్లాట్లుగా మార్చేసి విక్రయించారు.

విచ్చలవిడిగా ప్లాట్లు, విల్లాల నిర్మాణాలు

దక్షిణ భాగాన ఉన్న బఫర్ జోన్‌లో మూడు వెంచర్లు ఏర్పాటు చేశారు. ఒక దానిలో ఇప్పటికే ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. రెండు వెచర్లలో రోడ్లు వేసి నిర్మాణాలను ప్రారంభించారు. వెంచర్ ముందు భాగంలో అంతా సవ్యంగా ఉన్నట్లు కనబడుతున్నప్పటికీ వెనుక చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో రోడ్లు, భవనాలు నిర్మించారు. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సుతారిగూడలోని ఓ ఎన్‌క్లేవ్‌లో దాదాపు 6 ఎకరాల వరకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌కు సంబంధించిన విస్తీర్ణంలో ప్లాట్లు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం చెరువు నిండటంతో ఈ వెంచర్ వెనుక భాగంలోని చాలా ప్లాట్లు, రోడ్లు పూర్తిగా నీట మునిగి

మిగతా 7వ పేజీలో...



అధికారులు వేసిన మార్కింగ్

హిమాయత్‌సాగర్‌లో 'హైడ్రా' సర్వే

» ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధి నిర్ధారణ

» స్వతహాగా కూల్చివేస్తున్న పలువురు నేతలు

మొయినాబాద్ : హైడ్రా పేరు వింటేనే చెరువు, కుంటల పరీవాహక ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టిన వారి గుండెల్లో గుబులు మొదలవుతుంది. గండిపేట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలు కూల్చివేసిన హైడ్రా అధికారులు ప్రస్తుతం హిమాయత్ సాగర్ పరీవాహక ప్రాంతంపై దృష్టి సారించారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మించిన అక్రమ నిర్మాణాలు పరిశీలిస్తున్నారు. సంబంధిత అధికారులతో కలిసి రహస్యంగా సర్వేలు చేసి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిని గుర్తించి మార్కింగ్ చేస్తున్నారు. మొయినాబాద్ మండల పరిధిలోని అజీజ్‌నగర్, నాగిరెడ్డిగూడ రెవెన్యూ పరిధిలో ఇప్పటికే అధికారులు సర్వేలు చేసి హద్దులు నిర్ణయించారు.

అధికారులు కూల్చివేయక ముందే..

హిమాయత్‌సాగర్ పరీవాహక ప్రాంతంలో ఫాంహౌస్‌లు ఉన్న కొంత మంది ప్రముఖులు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్న నిర్మాణాలను అధికారులు కూల్చకముందే వారే తొలగించుకుంటున్నారు. బఫర్‌జోన్ పరిధిలోని ప్రహరీ, షెడ్లు తొలగించి ఫెన్సింగ్ వేసుకుంటున్నారు. అధికారులు కూల్చితే మీడియాలో ప్రచారం జరిగి అందరికీ తెలుస్తుందని ఇదంతా జరగకముందే స్వతహాగా కూల్చివేతలను ప్రారంభించారు. ఏపీకి చెందిన ఓ నేత ప్రహరీ బఫర్ జోన్‌లో ఉందని తెలియడంతో ముందుగానే తొలగొంచి ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నారు. తొలగించిన శిథిలాలు కూడా అక్కడ లేకుండా జాగ్రత్త పడుతున్నారు. ఓ మాజీ మంత్రి సైతం ప్రహరీని తొలగించి ఫెన్సింగ్ మాత్రం ఉంచారు. ఇక పరీవాహక ప్రాంతంలో కొందరు చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిని సూచించే హద్దురాళ్లు సైతం తొలగించినట్లు అధికారుల సర్వేలో తేలినట్లు తెలిసింది. కొందరు ప్రహరీ కోసం ఆక్రమిస్తే మరికొందరు ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి నింపి వినియోగించుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆక్రమణలు జరుగుతుంటే ఏం చేస్తున్నారు?

» అధికారులను ప్రశ్నించిన లోకాయుక్త విచారణ అధికారి

» తుమ్మలకుంట పరిశీలన

మహేశ్వరం: ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురవుతుంటే వాటిని పరిరక్షించాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఏం చేస్తున్నారని లోకాయుక్త విచారణ అధికారి మ్యాత్సకొషి మండిపడ్డారు. 'తుమ్మలకుంటను మింగిన వెంచర్' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి స్పందించిన లోకాయుక్త, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు తుమ్మల కుంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మంఖాల్ సర్వే నంబర్ 131లోని ప్రభుత్వ భూమి నుంచి ఓ ప్రైవేటు వెంచర్‌కు రోడ్డు ఎలా వేశారని, అదే విధంగా తుమ్మల కుంటనుంచి నీరు బయటకు వెళ్లకుండా ఉన్న దారులన్నింటినీ ఏ విధంగా మూసి వేశారనే అంశాలపై తగిన వివరణ ఇవ్వాలని తహసీల్దార్ సైదులు, ఇరిగేషన్ డీఈఈ దుద్యానాయక్‌ను ప్రశ్నించారు. వీలైనంత త్వరలో ప్రభుత్వ భూమినుంచి ప్రైవేటు వెంచర్‌కు రోడ్డు ఎలా వేశారో వివరాలను వెంటనే సమర్పించాలన్నారు. అదే విధంగా రోడ్డును ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఆ రోడ్డును మూసివేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ భూమిలో రోడ్డు వేయడంపై సర్దార్‌నగర్ గ్రామానికి చెందిన పలువురు రైతులు తమకు ఫిర్యాదు కూడా చేశారని విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని అదే విధంగా తుమ్మలకుంటను పూర్తిగా సర్వే చేసి హద్దురాళ్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మాజీ సర్పంచ్ రాకేష్‌గౌడ్, తుక్కుగూడ బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్‌తో పాటు పలువురు రైతులు ఉన్నారు.



తుమ్మల కుంటను పరిశీలిస్తున్న అధికారులు

ప్రయాణమెలా?

గుంతలతో వాహనదారులకు నరకం

» పట్టని పాలకులు, అధికారులు » మరమ్మతులు చేయాలని వేడుకోలు

పెద్దేముల్, సెప్టెంబరు 9: పల్లెరోడ్లపై ప్రయాణం వాహనదారులకు నరకంగా మారింది. పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే ఉన్న గుంతలతో పాటు కురుస్తున్న వర్షాలకు మరింత పెద్దవిగా మారడంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. పెద్దేముల్ మండల కేంద్రం నుంచి పెద్దేముల్ తండాకు వెళ్లే మార్గంలో చాలా చోట్ల గుంతలు పడటంతో పాటు రోడ్డుకిరువైపులా ముళ్లపొదలు కూడా తొలగించలేదు. అదేవిధంగా మలుపులు కూడా అధికంగా ఉండడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.



అధ్వానంగా రుద్రారం-నాగులపల్లి వెళ్లే రోడ్డు



గోపాల్‌పూర్-నర్సాపూర్ వెళ్లే రోడు

అదేవిధంగా పెద్దేముల్ తండా నుంచి రుద్రారం వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. పెద్దేముల్ తండా సమీపంలో కోట్‌పల్లి ప్రాజెక్టు కెనాల్‌పై నుంచి వేసిన కల్వర్టు కూడా శిథిలమైంది. కల్వర్టుపైన గుంతపడి ప్రమాదకరంగా మారింది. అది ఎప్పుడు కూలుతుందోనని వాహనదారులు భయపడుతూనే తప్పని పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ప్రమాదం జరగకముందే నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అసంపూర్తిగా రోడ్డు పనులు

పెద్దేముల్ మండలం గోపాల్‌పూర్ గ్రామ సమీపంలోని పీఆర్ రోడ్డు నుంచి ఇందూరు సమీపంలోని ఆర్అండ్‌బీ రోడ్డు వరకు 4.6 కిలోమీటర్ల మేర రోడ్డు వేసేందుకు గత ప్రభుత్వం రూ 2.25 కోట్లు కేటాయించింది. ఈ రోడ్డు రుద్రారం గేటునుంచి నర్సాపూర్ గ్రామం మీదుగా ఇందూరుకు వెళుతుంది. ఈ రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ సుమారు రెండు కిలోమీటర్ల వరకు రోడ్డును తవ్వి కంకర వేసి పనులు చేపట్టాడు. పనులు పూర్తిచేయకుండా అసంపూర్తిగా వదిలేశాడు. రోడ్డు వేయాల్సిన గడువు కూడా పూర్తైపోయింది. ప్రస్తుతం ఆ మార్గం అంతటా కంకర తొలగిపోయి గుంతలు ఏర్పడ్డాయి. వర్షాకాలంలో మురుగు నీటి గుంతలను తలపిస్తున్నాయి. ఈ రోడ్డుపై ప్రయాణం వాహనదారులకు నరకంగా మారింది. గుంతల రోడ్లపై ప్రయాణం చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



రుద్రారం వెళ్లే మార్గంలో కల్వర్టుపై గుంతలు



గుంతలు పడిన పెద్దేముల్ తండారోడ్డు

పెళ్లికాని ప్రసాద్‌ల పూజలు

వినాయకుడి సన్నిధిలో యువకుల వివాహ సాఫల్య పూజలు

వికారాబాద్ జిల్లా ధారూరు పాండరంగాస్వామి ఆలయంలోని వినాయక మండపంలో సోమవారం వివాహ సాఫల్య పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో గ్రామంలోని పెళ్లి కాని యువకులు పాల్గొని సహస్రనామాలు పఠిస్తూ కల్యాణం కోసం గణనాథున్ని ప్రార్థించారు. కాగా గ్రామంలోని మండపాల్లో వినాయకుని పూజలు ఘనంగా కొనసాగుతున్నాయి. పూజల అనంతరం ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

- ధారూరు, సెప్టెంబరు 9





గోనె సంచులతో గణపయ్య

వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణానికి చెందిన మైక్రో ఆర్టిస్టు బిరకట్ మధుసూదన్ గోనె సంచులతో శివ తాండవం చేస్తున్న వినాయకున్ని తయారు చేశారు. వినాయక ఉత్సవ నిర్వాహకులు కాళికాదేవి ఆలయ ఆవరణలో ప్రతిష్ఠించారు. గతంలో బిరకట్ మధుసూదన్ విభిన్న రీతిలో వినాయకున్ని తయారు చేశారు. గతంలో న్యూస్‌పేపర్, టిష్యూపేపర్, బుట్టలు, వరిగడ్డితో, గోధుమ గింజలతో వివిధ రూపాల్లో లంబోదరులను తయారు చేశారు. పర్యావరణానికి హాని కలగకుండా ఆకట్టుకునే విధంగా ప్రతిష్ఠింపచేశారు. అయితే ఈసారి అందర్ని ఆకట్టుకునే విధంగా గోనె సంచులతో వినాయకుడిని తయారు చేశారు. - తాండూరు, సెప్టెంబరు 9

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రైతులను తిప్పించుకోవడం లేదు

సాంకేతిక పొరపాట్లను సరిదిద్దుతున్నాం

ఏడీఏ రుద్రమూర్తి

7

లేనిది ఉన్నట్లుగా రోగ నిర్ధారణ

ఆస్పత్రిపై మహిళ ఫిర్యాదు

7

బీసీ హక్కుల సాధనకు కలిసి రావాలి



రమేష్‌కు నియామకపత్రం అందజేస్తున్న కటికల శ్రీహరి

కందుకూరు, సెప్టెంబరు 9 : బీసీల హక్కుల సాధనకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని, కుల గణన చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని సమాజ్ వాది పార్టీ రాష్ట్ర కార్యదర్శి జిల్లా ఇన్‌చార్జి కటికల శ్రీహరి డిమాండ్ చేశారు. సోమవారం బీసీ సంఘం నేతలు, ఎస్పీ నేతలతో కలిసి కందుకూరులోని సీతా రామశాస్త్రి కల్యాణ మండపంలో విలేకరులతో మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యమొచ్చి 78సంవత్స రాలు గడుస్తున్నా బీసీలు అభివృద్ధి చెందలేదన్నారు. ప్రధానమంత్రిగా బీసీ నేత నరేంద్రమోదీ ఉన్నా బీసీ లకు చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు కామారెడ్డి డిక్లరేషన్ మేరకు కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కులగణన చేసి ఎన్ని కల్లో 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. సమావేశంలో సంఘం నాయకులు వెంకటేష్, ఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కోటేశ్వర్, ఎస్పీ కందు కూరు, మహేశ్వరం మండలాల అధ్యక్షులు రమేష్, కాకి అజయ్, అల్లె నర్సింహ, అంజయ్య, డి.యాద గిరి, ఎం.సాయిబాబ పాల్గొన్నారు. కాగా దెబ్బడగూ డకు చెందిన పొడిపాల రమేష్‌ను ఎస్పీ మండల శాఖ అధ్యక్షుడిగా నియమించినట్లు శ్రీహరి, కోటేశ్వ ర్‌లు తెలిపారు. ఇప్పటి వరకు ఈ బాధ్యతల్లో ఉన్న తేరటి అంజయ్యకు జిల్లా బాధ్యతలు అప్పగించారు.



16వ ఆర్థిక సంఘం సమావేశంలో విశాలశ్రవణ్‌రెడ్డి, గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి

పంచాయతీలకు అధిక నిధులివ్వాలి

కేశంపేట/కడ్తాల్, సెప్టెంబరు 9: 16వ ఆర్థిక సంఘం రాష్ట్ర పర్యటనలో భాగంగా సోమ వారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సంఘం చైర్మన్ డాక్టర్ అరవింద్ ఫనాగరియ అధ్య క్షతన స్థానిక సంస్థల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో కేశంపేట మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి, కడ్తాల మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్, అధికారులు స్థానిక సంస్థల సభ్యుల సల హాలు తీసుకున్నారు. పంచాయతీలు, పరిషత్‌లకు ఎక్కువ నిధులు, అధికారులివ్వాలని కోరారు. ఆయా సంస్థలకే నిధులు నేరుగా కేటాయిస్తే అభివృద్ధి వేగవంతం అవుతుందన్నారు. 16వ ఆర్థిక సంఘంలో చేర్చాల్సిన అంశాలను వివరించినట్లు సభ్యులు తెలిపారు. స్థానిక సంస్థల విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలని కోరినట్లు ఈ సందర్భంగా లక్ష్మీనర్సింహా రెడ్డి తెలిపారు. సమావేశంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేశ్‌కుమార్, కమి షనర్ అనితరామచంద్రన్, ఫైనాన్స్ కమిషనర్ రామకృష్ణారావు, రంగారెడ్డి జిల్లా నుంచి మాజీ ఎంపీపీ పద్మారెడ్డి, మాజీ సర్పంచ్‌లు కిరణ్‌కుమార్‌గౌడ్, సురేందర్ పాల్గొన్నారు.

రైతులంతా ఐకమత్యంతో ముందుకు సాగాలి



మార్కెట్ యార్డులో జెండాను ఆవిష్కరిస్తున్న కిసాన్ సంఘ్ నాయకులు

చేవెళ్ల, సెప్టెంబరు 9 : రాజకీయ పార్టీలు వేరైనా రైతులంతా సంఘటితంగా ముందుకు సాగాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యదర్శి పెంటారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణ రెడ్డి అన్నారు. సోమవారం చేవెళ్లలోని మార్కెట్ యార్డులో భారతీయ కిసాన్ సంఘ్ సమావేశాన్ని నిర్వహించారు. అలాగే బలరాం భగవాన్ జన్మదినం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ... వ్యవసాయానికి మూల పురుషుడు బలరాముడన్నారు. ఆయనను ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు లక్ష్మారెడ్డి, ఈశ్వరప్ప, రమణారెడ్డి, దేవర వెఎంకట్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మల్లారెడ్డి, రాజేంద్రప్రసాద్, విశ్వనాథ్, వీరేశం, రఘుపతిరెడ్డి, అంజిరెడ్డి, ఇతర రైతులు పాల్గొన్నారు.

ఓటు.. నమోదు చేసుకోండి



- మార్పులు, చేర్పులకు అవకాశం
- ఓటర్ల జాబితా సవరణకు శ్రీకారం
- ఇంటింటా సర్వేలో బీఎల్వోలు
- యాప్‌లో వివరాల నమోదు
- ఈనెల 18వ వరకు గడువు

యాప్‌లో వివరాల నమోదు

2025 జనవరి 1 తేది నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు కొత్తగా ఓటు హక్కు పొందేందుకు అర్హులు. ఈ మేరకు చేర్పుల నిమిత్తం కుటుంబంలో ఎవరైనా ఉన్నారా? అనే వివరాలపై బీఎల్వోలు సర్వే చేపట్టారు. ఇందుకు సంబంధించి ఈనెల 18వరకు గడువు ఉంది. ఈ యాప్‌లో పోలింగ్ కేంద్రానికి సంబంధించి విద్యుత్, తాగునీరు, ర్యాంప్‌లు, మరుగు దొడ్ల వంటి మౌలిక వసతులు ఉన్నాయా? లేదా అనే అంశాలను నమోదు చేస్తారు.

తాండూరు, సెప్టెంబర్ 8: ఓటర్ల నమోదుపై ఎన్నికల సంఘం మరోసారి దృష్టి సారించింది. ప్రతీయేటా చేపట్టే తరహాలోనే ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బూత్‌స్థాయి అధికారులు (బీఎల్వోలు) క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి కొత్తగా ఓటు హక్కు పొందేవారి వివరాల నమోదుతో పాటు మృతులు, శాశ్వత వలస ఓటర్లు, పెళ్లైన వారి ఓటర్ల తొలగింపు, సవరణల నిమిత్తం దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈ ప్రక్రియ మొత్తం డివిజన్ స్థాయిలో ఆర్డీవో, మండల స్థాయిలో తహసీల్దార్లు పర్యవేక్షిస్తారు. ఇందుకు సంబంధించి బీఎల్వోలు ఇంటింటికీ తిరిగి ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నారు. కాగా, 2025 జనవరి 6న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నారు.

బీఎల్వోలకు ప్రత్యేక రిజిష్టర్లు

ప్రతీ బూత్‌కు సంబంధించి బీఎల్వోలకు ఈసారి ప్రత్యేకంగా తయారు చేసిన రిజిష్టర్లను అందజేశారు. దానిలో పోలింగ్ బూత్‌లతో పాటు పూర్తి వివరాలను పొందపర్చారు. స్టేట్‌మెంట్-1లో స్టాటిస్టికల్ ఇన్‌ఫర్మేషన్ పొందుపర్చారు. వయస్సు వారీగా ఓటర్ల సంఖ్యను పొందుపర్చారు. 18-19 సంవత్సరాలు, 20-29, 30-39, 40-49, 50-59, 60-69 సంవత్సరాల వారీగా ఓటర్ల సంఖ్యను పేర్కొన్నారు.

స్టేట్‌మెంట్-2లో..

18 రకాల కాలమ్స్ ద్వారా ఓటరు పూర్తి సమచారాన్ని ఇందులో కోరారు. ఫొటో ఓటర్‌దేనా, ఎంపిక నెంబర్, పుట్టిన తేదీ, ఇంటి నంబర్, ఇంటి పేరు, పేరు, బంధుత్వం, వయస్సు, టెలిఫోన్ లేదా మొబైల్ నంబర్, ఆధార్ నెంబర్, మెయిల్ ఐడీ, ఫొటో మార్పులు ఉంటే వివరాలు, చనిపోయారా, వలసనా, రిపీటెడ్, ఎన్ని ఏళ్లుగా నివసిస్తున్నారు వంటి తదితర వివరాలను బీఎల్వోలు రిజిష్టర్‌లో నమోదు చేస్తారు. ప్రస్తుతం తుది జాబితాలో ఉన్న ఓటర్ల వివరాల ప్రకారం బీఎల్వోలు సర్వే నిర్వహిస్తారు. జాబితాలో ఉన్న చిరునామాలోనే ఓటర్ ఉంటున్నారా? లేక మార్పులు ఏమైనా చేయాలా వంటి పలు రకాల అంశాలపై బీఎల్వోలు క్షేత్రస్థాయిలో ఆరా తీస్తున్నారు.

ఫారాల రకాలు

దరఖాస్తుకు ఫారం -6, సవరణకు-7, చిరునామా బదిలీకి-8 వంటివి ఉపయోగించుకోవచ్చు. కాగా, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోను దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు.

ముఖ్యమైన తేదీల వివరాలు	
సర్వే ఎప్పటి వరకు	అక్టోబరు 18
ముసాయిదా జాబితా	అక్టోబరు 29
అభ్యంతరాల స్వీకరణ	డిసెంబరు 24
తుది జాబితా ప్రచురణ	6 జనవరి 2025

ఓటర్ల వివరాలు

మండలం, మున్సిపాలిటీ	పురుషులు	మహిళలు	మొత్తం	పోలింగ్ కేంద్రాలు
పెద్దేముల్	19228	20279	39507	46
కోట్‌పల్లి	3167	3353	6520	08
యాలాల	19504	21389	40893	48
బషీరాబాద్	19014	20903	39917	47
తాండూరు	56996	59492	11488	120
మొత్తం	117909	125161	243332	269

పెద్దచెరువు అన్యాక్రాంతం!

(5వ పేజీ తరువాయి..)

దర్శనమిస్తున్నాయి. దీంతో వెంచర్ లోపల నీరు చేరకుండా గత కొద్ది రోజులుగా పెద్ద మొత్తంలో మట్టి డంపు చేసి నీరు లోపలికి రాకుండా చర్యలు చేపడుతున్నారు. అదే విధంగా ఈ వెంచర్‌కు ఆనుకుని ఉన్న మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చే మరో వెంచర్‌లోనూ బఫర్‌జోన్‌లో విల్లాలు చేపడుతున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంచర్ నాలుగు దిక్కుల పక్కాగా ప్రహరీ ఏర్పాటు చేసి లోపల పనులు చేపడుతున్నందున బాహ్య ప్రపంచానికి చెరువు బఫర్ జోన్ కబ్జా కనబడని పరిస్థితి నెలకొంది. ఈ విల్లాలు నిర్మిస్తున్న రియల్‌ఎస్టేట్ సంస్థ వారికి రాష్ట్ర రాజకీయాలను శాసించే నేతల అండదండలు ఉండటంతో అటు పక్క వెళ్లడానికి కూడా అధికారులు జంకుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అధికారులు ఎలా స్పందిస్తారని స్థానికులు ఎదురుచూస్తున్నారు.

కాలువల విధ్వంసం

చెరువు కట్ట కింద వ్యవసాయ పొలాలకు నీరు వెళ్లే పెద్ద కాలువలు, పిల్ల కాలువలు, అలుగు నీరు పారే పెద్ద నాలా పూర్తి స్థాయిలో కబ్జాకు గురయ్యాయి. చెరువు కట్ట కింద స్థలాల్లో వెలిసిన వెంచర్ల కారణంగా వ్యవసాయ పొలాలకు నీరందించే కాలువలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. విలేజ్ మ్యాప్‌లో కాలువులు కనబడుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. చెరువు అలుగు నీరు పారే పెద్ద కాలువ ఇరువైపున ఉన్న బఫర్‌జోన్ స్థలంలోనూ పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపట్టారు. కాలువ 15 మీటర్ల వెడల్పు ఉండాల్సి ఉండగా 8 మీటర్లకు కుచించుకు పోయింది. నాలా ఇరు వైపున తొమ్మిది మీటర్లు వదిలి నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా కొందరు నాలాను అనుకుని నిర్మాణాలు చేపట్టారు. దీంతో నాలా మొత్తం కుచించుకు పోయి చిన్న కాలువగా మారింది.



ఎఫ్‌టీఎల్ పరిధిలో చదును చేసిన స్థలం



నీట మునిగిన ఓ ఎన్‌క్లేవ్‌లోని రోడ్లు, ప్లాట్లు

ఆక్రమణలపై చర్యలు చేపట్టాలి



హద్దు రాళ్లను తొలగించి రియల్టర్లు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మాణాలు చేపట్టారు. పద్మశ్రీ ఎన్‌క్లేవ్‌లో 6 ఎకరాల ఎఫ్‌టీఎల్ స్థలంలో ప్లాట్లు, రోడ్లు ఏర్పాటు చేసినట్టు గుర్తించాం. ప్రస్తుతం అక్కడే సమీపంలో 24 ఎకరాల్లో కొత్తగా నిర్మిస్తున్న విల్లాస్ వెంచర్ వెనుక భాగంలో బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపడుతున్నారు కాలువలు, అలుగు నాలా పూర్తిగా కబ్జాకు గురయ్యాయి. అధికారులు చర్యలు తీసుకొని చెరువును కాపాడాలి.

- వేముల శ్రీనివాస్‌రెడ్డి, సాగునీటి సంఘం మాజీ చైర్మన్

చీరలే శ్రీరామరక్ష



పెద్దేముల్ మండలం తట్టెపల్లి సమీపంలో మొక్కజొన్న పంటకు రక్షణగా ఏర్పాటు చేసిన చీరలు

పెద్దేముల్, సెప్టెంబరు 9: అడవి పందుల నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పంట నాశనం కాకుండా కాపాడుకునేందుకు ఎన్నో కష్టాలు పడుతున్నారు. కొందరు సోలార్ పానెళ్లను ఏర్పాటు చేసుకుంటుంటే.. చిన్న, సన్నకారు రైతులు పాత చీరలను పంటలకు రక్షణగా వాడుకుంటున్నారు. పొలం చుట్టూ చీరలు కట్టడం వల్ల అడవి పందులు రావడం లేదని రైతులు చెబుతున్నారు.

కాళోజీ యాదిలో..

కలంతో కవి కాళోజీ చిత్రం గీసిన సూక్ష్మ చిత్రకారుడు డాక్టర్ అశోక్





అశోక్ గీసిన కాళోజీ చిత్రం

దౌల్తాబాద్, సెప్టెంబరు 9: మండలంలోని యాంకి గ్రామానికి చెందిన డాక్టర్ సున్నపు అశోక్ సూక్ష్మ చిత్రకళలో సిద్ధహస్తుడు. తెలంగాణ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని కవి కాళోజీ బొమ్మ గీసి ఆ సాహిత్య సత్పురుషుడిపై తన కళాభిమానాన్ని చాటుకున్నాడు. ప్రజా కవి, తెలంగాణ ఉద్యమకారుడు, నిజాం నిరంకుశత్వాన్ని ప్రశ్నించిన గొంతుక, ప్రజా చైతన్య మూర్తి, పద్మ విభూషన్ కాళోజీ నారాయణరావు 110వ జయంతి సందర్భంగా ఆ మహనీయుడి యాదిలో తన కలంతో ఆయన చిత్రాన్ని గీసి నివాళులర్పించాడు. ఈ సందర్భంగా పలువురు అశోక్ గీసిన చిత్రాన్ని చూసి అభినందించారు.

సమన్వయంగా పని చేయండి



అధికారులతో సమీక్షిస్తున్న సబ్ కలెక్టర్

తాండూరు, సెప్టెంబరు 9: ఈ నెల 11వ తేదీన తాండూరులో జరిగే వినాయక నిమజ్జన కార్యక్రమంలో అధికారులందరూ బాధ్యతగా సమన్వయంగా పనిచేయాలని తాండూరు సబ్‌కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ ఆదేశించారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖ, ఫైర్, ఇరిగేషన్ శాఖల అధికారులతో నిమజ్జనంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. నిమజ్జనం, ఊరేగింపు జరిగే రోడ్లలో గుంతలను పూడ్చడం, శానిటేషన్ లైట్లను మున్సిపల్ అధికారులు చేపట్టాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఊరేగింపు వివరాలను పోలీస్ శాఖను అడిగి తెలుసుకున్నారు. ఊరేగింపు సమయంలో విద్యుత్ వైర్లను ముందుగానే గుర్తించాలని విద్యుత్ ఏఈకి సూచించారు. నిమజ్జనం చేసే ప్రాంతాలైన మల్‌రెడ్డి, కోకట్ కాగ్నా నది వద్దకు పిల్లలను వెళ్లనీయొద్దన్నారు. ప్రత్యేక పోలీసు బలగాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి వివరించారు. ఈ సమావేశంలో తాండూరు తహసీల్దార్ తారాసింగ్, డీఎల్పీవో శంకర్‌నాయక్, పీఆర్ డీఈఈ, కమిషనర్, విద్యుత్‌శాఖ ఏఈ, అధికారులు పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన



అన్నారంలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

కొడంగల్, సెప్టెంబరు 9: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. పత్తి, మినుము, పెసర పంటలు దెబ్బ తినడంతో కొడంగల్ మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన రైతులు మూడు రోజుల కిందట కొడంగల్ వ్యవసాయ శాఖ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన అధికారులు సోమవారం ఏఈవో దేవేందర్ రాథోడ్ ఆధ్వర్యంలో పంట పొలాలను పరిశీలించారు. పత్తిపొలాల్లో నీరు చేరడంతో నష్టానికి గురైనట్లు రైతులు సాయిలు, మల్లప్ప, రాములు, మహిబూబ్, ఎల్లప్ప అధికారులకు వివరించారు. నష్టపోయిన పంటలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు ఏఈవో తెలిపారు.

గుంతల రోడ్డుపై వరినాట్లు

బీజేపీ ఆధ్వర్యంలో వినూత్న నిరసన



కంకల్ రోడ్లపై పడిన గుంతల్లో వరినాట్లు వేస్తూ నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

పూడూరు, సెప్టెంబరు 9: మండల పరిధిలోని కంకల్ గ్రామంలో రోడ్డుపై గుంతలు పడి వర్షానికి నీరు నిలిచి అధ్వానంగా మారాయి. గుంతల రోడ్లను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని బీజేపీ నాయకులు ఆరోపించారు. బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం పూడూరు రోడ్డుపై వరినాట్లు వేసి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్ కంకల్, మండల ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య తదితరులు మాట్లాడుతూ.. 12ఏళ్లుగా ఈ గుంతల రోడ్లను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వానికి పలు మార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి గుంతలతో బురదమయంగా మారిన రోడ్లను బాగు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే కంకల్ నుంచి చిట్టెంపల్లి గేటు వరకు పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్ కంకల్, మండల ప్రధాన కార్యదర్శి రాంచంద్రయ్య, శక్తి కేంద్రం ఇన్‌చార్జి విఠల్, అశోక్, శివకుమార్, మేకల చంద్రశేఖర్, శ్రీను, గ్రామస్తులు, జంగయ్య, నారాయణ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



యాలాల మండం కోకట్ వాగు దగ్గర వినాయక నిమజ్జన స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

యాలాల, సెప్టెంబరు 9: మండలంలోని కోకట్ కాగ్నా వాగు వద్ద జరిగే వినాయక నిమజ్జనం స్థలాన్ని సబ్‌కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో కలిసి నిమజ్జన ఏర్పాట్లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ ఉన్నారు.

లేనిది ఉన్నట్లుగా రోగ నిర్ధారణ

ఆస్పత్రిపై మహిళ ఫిర్యాదు

మేడ్చల్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లేని రోగం ఉన్నట్లు ఉన్నట్టుగా రిపోర్టులు ఇచ్చి కొత్త ఆరోగ్య సమస్యను తీసుకొచ్చిన ఓ ప్రైవేటు ఆస్పత్రిపై, పరీక్షలు నిర్వహించిన డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఓ మహిళ సోమవారం కలెక్టరేట్‌లోని డీఎం అండ్ హెచ్‌వో కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. వైద్యంచేసి రోగం నయం చేస్తారని ఆస్పత్రికి వెళ్తే ప్రాణం పోయినంత పనిచేశారని తన గోడును వెళ్లబోసుకుంది. బాధితురాలి వివరాల ప్రకారం.. మేడ్చల్‌కు చెందిన బి.స్వాతి గత మార్చి నెలలో గొంతుపై వాపు రావటంతో దుండిగల్‌లోని అరుందతి ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం వెళ్లగా ఆస్పత్రి నిర్వాహకులు క్షయ వ్యాధి సోకి ఉండవచ్చనే అనుమానంతో ఎఫ్ఎన్ఏసీ పరీక్షలు చేయించారు. రిపోర్టుల్లో నెగెటివ్ రావటంతో సాధారణ మందులు ఇచ్చి పంపించారు. అనంతరం స్వాతికి జ్వరం రావటంతో మేడ్చల్‌లోని లీలా ఆస్పత్రికి వైద్యం కోసం వెళ్లింది. ఆస్పత్రి వైద్యులు టీబీ ఉండవచ్చన్న అనుమానంతో తిరిగి ఎఫ్ఎన్ఏసీ పరీక్ష కోసం స్థానిక టెస్లా డయగ్నస్టిక్ సెంటర్‌కు పంపి పరీక్షలు చేయించగా అందులో పాజిటివ్‌గా తేలింది. దీంతో రిపోర్టులు తీసుకుని స్వాతి ఏప్రిల్ 30వ తేదీన మేడ్చల్ టీబీ సెంటర్‌కు వెళ్లి క్షయ వ్యాధి(టీబీ)కి సంబంధించిన మాత్రలను వాడటం ప్రారంభించింది. దీంతో ఆరోగ్యం మరింత క్షీణించి మే 5వ తేదీన స్థానికంగా ఉన్న సంప్రద ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని అక్కడా టీబీ టెస్ట్ చేయగా నెగెటివ్ వచ్చింది. దీంతో తనకు లేని రోగానికి మందులు ఇచ్చి ఆరోగ్యం మరింత క్షీణింపజేశారంటూ బాధితురాలు లీలా ఆస్పత్రి, టెస్లా డయాగ్నస్టిక్ సెంటర్‌పై జిల్లా వైద్య శాఖ అధికారులకు ఫిర్యాదు చేసింది. తప్పుడు మందులు వాడటంతో తన ఆరోగ్యం మరింత క్షీణించటంతో రూ.4లక్షల వరకు ఖర్చుచేసి వైద్యం చేయించుకున్నానని బాధితురాలు వాపోయింది. ప్రభుత్వం ఆర్థికసాయం అందజేసి ఆదుకోవాలని స్వాతి అధికారులతో మొరపెట్టుకుంది.



కలెక్టరేట్ వద్ద తన గోడు వెళ్లబోసుకుంటున్న స్వాతి

ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణ సమితి



నియామకపత్రం అందుకుంటున్న సిద్ధార్థ

షాద్‌నగర్ రూరల్, సెప్టెంబరు 9 : ఆలిండియా ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ సమితి జాతీయ ఉపాధ్యక్షుడిగా ఫరూఖ్‌నగర్ మండలం గంట్లవెల్లికి చెందిన బాదెపల్లి సిద్ధార్థ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని మాతా రమాబాయి ఆడిటోరియంలో ఆదివారం జరిగిన సమావేశంలో జాతీయ అధ్యక్షుడు జి.మురళీధర్‌రావు ఆయనకు నియామకపత్రం అందజేశారు. సిద్ధార్థ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషిచేస్తానని తెలిపారు.

పరిహారం చెల్లించాకే 765కేవీ లైన్ పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న చింపుల సత్యనారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 9 : రైతులకు నష్టపరిహారం చెల్లించిన తరువాతే 765 కేవీ ఎలక్ట్రికల్ ట్రాన్స్‌మిషన్ లైన్ నిర్మాణం చేపట్టాలని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం లక్డీకాపూల్‌లోని తన కార్యాలయంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్రంలో చేపడుతున్న 765ఎలక్ట్రికల్ ట్రాన్స్‌మిషన్ లైన్ నిర్మాణ పనులతో రైతులు తమ భూములను కోల్పోతున్నారని తెలిపారు. రైతులు, రైతు సంఘాలతో చర్చించి నష్టపరిహారాన్ని లెక్కగట్టి పరిహారాన్ని నిర్ణయించాలన్నారు. రైతులకు నోటీసులు, సమాచారం ఇవ్వకుండా బీఆర్-మహేశ్వరం ట్రాన్స్‌మిషన్ లైన్ నిర్మాణం చేస్తున్నారని తెలిపారు. ఈ నిర్మాణంతో రంగారెడ్డి, మహబూబ్‌నగర్, సంగారెడ్డి జిల్లాల్లో 20మండలాల్లో 315 గ్రామాల మీదుగా 190కిలో మీటర్ల మేర లైన్ వెళ్తోందని, దీనితో రైతులు 3,200ఎకరాల భూమి కోల్పోవాల్సి వస్తుందన్నారు. 2013-14లో 400కేవీ లైన్ వేసినప్పుడు ఇచ్చిన పరిహారాన్నే ఇప్పుడు ఇవ్వాలని చూస్తున్నారని, పదేళ్ల తర్వాత కూడా ఇదే పరిహారం ఇలా ఇస్తారని, భూముల రేటు నాలుగింతలు పెరిగిందన్నారు. జీవోను చూపి దౌర్జన్యంగా పొలాల్లో 765కేవీ లైన్ పనులు చేస్తున్నారని ఆరోపించారు. పనులను వెంటనే ఆపకుంటే రైతుల పక్షాన రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. 2003 ఎలక్ట్రిసిటీ చట్టం, 2017 సుప్రీంకోర్టు తీర్పుల అనుసరించి ఒక్కో టవర్‌కు 15-20లక్షలు అందేలా, కారిడార్ లైన్‌కు మరో 15-20లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ కార్యదర్శి మాదిపల్ వెంకట్ ఉన్నారు.

రైతులను తిప్పించుకోవడం లేదు

సాంకేతిక పొరపాట్లను సరిదిద్దుతున్నాం

ఏడీఏ రుద్రమూర్తి వివరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, సెప్టెంబరు 9: వ్యవసాయ కార్యాలయాలకు రైతులను తిప్పించుకోవడంలేదని, సవరణ చేసేందుకు వ్యవసాయాధికారిని కలువని చెప్పామని తాండూరు ఏడీఏ రుద్రమూర్తి స్పష్టం చేశారు. 'రుణమాఫీ కాలేదు.. న్యాయం చేయండి' అనే శీర్షికన ఈనెల 6వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఏడీఏ స్పందించారు. రైతులకు సలహాలు, సూచనలు ఇస్తామని సాంకేతిక పొరపాట్లను సరిదిద్దుతున్నామన్నారు. తాండూరు పట్టణం మల్‌రెడ్డిపల్లికి చెందిన రైతు దస్తగిరి వెంకటయ్య జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి కలిసి రెండు ఖాతాలతో పాటు మరో వ్యక్తి మక్తల్ చిన్న అంజన్న ఖాతా వివరాలు నమోదవడంతో రుణమాఫీ కాలేదని తెలిపారు. మొత్తంగా రూ.3లక్షల 95వేల 666 నమోదైందని చెప్పారు. యూబీఐతో తాండూరులో, మక్తల్ బ్రాంచ్‌లో రుణాన్ని పొందారని ఒక కస్టమర్ ఐడీ వేర్వేరు ఆధార్ నంబర్లకి మ్యాప్ చేయడం వల్ల, గ్రూపు రుణం వల్ల, ఒకే రుణ ఖాతా ఒకరి కన్నా ఎక్కువ మందికి లింక్ కావడం వల్ల ఇలా జరిగి ఉండవచ్చని స్పష్టం చేశారు. రైతు వెంకటయ్య బ్యాంకుకు వెళ్లి వ్యవసాయ శాఖ అధికారితో మాట్లాడాలని సూచించామే తప్ప తప్పించుకోవడంలేదన్నారు. సవరణ చేసేందుకు వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సహకరిస్తున్నారని ఏడీఏ కోరారు.


కోదండరెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



కోదండరెడ్డికి శుభాకాంక్షలు చెబుతున్న కాంగ్రెస్ నాయకులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 9 : తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ-రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన ముదిరెడ్డి కోదండ రెడ్డిని ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోమవారం నగరంలోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన నాయకులు శేఖర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, త్యాలపల్లి కృష్ణ, అలీ ఉన్నారు. అలాగే కొత్త పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కూడా కలిసి సన్మానించారు.

ప్రెస్ చాంపియన్‌షిప్‌లో చేవెళ్ల వాసుల ప్రతిభ



చేవెళ్ల, సెప్టెంబరు 9: ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన అంతర్ జిల్లాల బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్-2024 పోటీల్లో చేవెళ్ల వోగ్ ఫిట్‌నెస్ సభ్యులు ప్రతిభ చూపారు. చేవెళ్లకు చెందిన సాయితేజ, నవీన్ కుమార్‌రెడ్డి స్వర్ణం, జూనియర్ కేటగిరీలో శివశంకర్ స్వర్ణ పతకం సాధించారు. వెంకట్‌రాంరెడ్డి, చంద్రశేఖర్, రాజుకుమార్‌లు కాంస్యం సాధించారు. ఈ సందర్భంగా వారు కోచ్ శ్రీశైలానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నాలుగు కొమ్ముల గొర్రెపొట్టేలు

చూసేందుకు ఎగబడిన జనం



నాలుగు కొమ్ములతో ఉన్న గొర్రె

పెద్దేముల్, సెప్టెంబరు 9: గొర్రెలు, మేకలకు సాధారణంగా రెండు కొమ్ములు మాత్రమే ఉంటాయి. కాని ఒక గొర్రెకు నాలుగు కొమ్ములు ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ వింత పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చెంగోల్ కుర్వ వెంకటయ్య వద్ద గొర్రెలు ఉన్నాయి. అతడి వద్ద ఉన్న గొర్రెలలో ఒకగొర్రెకు నాలుగుకొమ్ములు వచ్చాయి. అతడి వద్ద ఉన్న గొర్రెలను రోజూ బీడుభూముల్లో మేపడానికి తీసుకెళ్తుంటే రోడ్డుపై వెళ్లేవారు నాలుగుకొమ్ముల గొర్రెను చూడగానే ఆశ్చర్యపోతున్నారు. వారి వాహనం నిలిపి దానిని ఫొటోలు తీసుకుంటున్నారు. ఇలాంటి గొర్రెను తాము ఎక్కడ చూడలేదని ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారని, చాలా మంది గొర్రెను అమ్ముతావా అని అడుగుతున్నారని గొర్రెల కాపరి వెంకటయ్య తెలిపాడు. కానీ ఆ గొర్రెను తాను అమ్మబోనని చెప్పాడు.

జీవ నదిలా ప్రవహించేది తెలుగు భాష



కార్యక్రమంలో మాట్లాడుతున్న డా.బాణాల భుజంగరెడ్డి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 9: తెలంగాణ భాష జీవద్భాష అని, ఇతర భాషల పదాలన్నింటినీ తనలో కలుపుకొని ఓ జీవనదిలా ప్రవహించే పలుకుబడుల భాష అని కేంద్రీయ విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డా.బాణాల భుజంగరెడ్డి అన్నారు. డా.కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఆనాటి నాయకుడు జయప్రకాశ్‌నారాయణ గురించి పలికిన 'పుట్టుక నీది. చావు నీది. బతుకంతా దేశానిది' అనే మాటలు ఆయనకే వర్తిస్తాయన్నారు. ఆయన తన జీవితమంతా తెలంగాణ ప్రజాజీవనం, భాషా సంస్కృతుల పరిరక్షణ కోసం ఉద్యమించారని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమం, గ్రంథాలయ ఉద్యమం, తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయన ప్రత్యేక ముద్ర వేశారంటూ గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.రాధిక, తెలుగు విభాగం అధ్యక్షుడు డా.కె.సురేష్, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలోని విద్యావనరుల కేంద్రంలో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు డా.వి.పరమేష్, చంద్రశేఖర్, జమీర్, మల్లేష్, విష్ణు, ఆనంద్, మహేష్ తదితరులు ఉన్నారు.

పొలంలో భారీ కొండ చిలువ



యాచారం, సెప్టెంబరు 9 : మూడున్నర మీటర్ల పొడవైన కొండచిలువ గ్రామ సమీపంలోని పంట పొలంలో కనిపించడంతో గ్రామస్తులు భయాందోళన చెందిన సంఘటన కుర్మిద్దలో జరిగింది. సోమవారం రైతు కిషన్‌రెడ్డి తన పొలంలో పచ్చిగడ్డి కోస్తుండగా భారీ కొండ చిలువ కనిపించింది. దీంతో రైతు తేరుకొని పాముకు దూరంగా పరుగెత్తాడు. విషయాన్ని వెంటనే గ్రామస్తులకు చెప్పాడు. రైతులు కొండచిలువను గ్రామానికి దూరంగా తీసుకెళ్లి చంపేశారు. ఏడాది కింద కూడా ఓ కొండ చిలువ హైటెన్షన్ వైర్లపై పాకడంతో అటవీ శాఖ అధికారులు దాన్ని తీసి అడవిలో వదిలారు. గ్రామ సమీపంలో తరచూ కొండచిలువలు కన్పిస్తుండడంతో ఎప్పుడేప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు భయపడుతున్నారు.

అలుగు పారుతున్న సురసముద్రం చెరువు



నిండుగా ఉన్న సురసముద్రం చెరువు

ఆమనగల్లు, సెప్టెంబరు 9 : భారీ వర్షాలతో ఆమనగల్లు సురసముద్రం చెరువు నిండింది. చెరువు అలుగు రెండోరోజు సోమవారం కూడా ప్రవహించింది. ఇరిగేషన్, పోలీసు, మున్సిపల్ శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. చెరువు వద్ద నిఘా ఏర్పాటు చేశారు. రెండేళ్ల తర్వాత సురసముద్రం చెరువు అలుగు పారడంతో చూసేందుకు స్థానికులు పెద్దసంఖ్యలో వస్తున్నారు. అలుగు సమీప ఇళ్లను ఖాళీ చేయాలని అధికారులు ఆదేశించారు. సురసముద్రం చెరువు అలుగు పారి మేడిగడ్డ కత్వ వాగులోకి చేరుతోంది. దీంతో మేడిగడ్డ-శంకర్ కొండ తండాల మధ్య వాగుపై రాకపోకలు నిలిచాయి. పలుగ్రామాల్లో జొన్న పంట దెబ్బతింది. మేడిగడ్డ తండా సమీపంలో వానకు నేలకొరిగిన జొన్న చేనును కోసి రైతులు పశువులకు మేత వేస్తున్నారు. శెట్టిపల్లి చెరువు దిగువన జొన్న, పత్తి, వరి పంటలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. వర్షాలకు గ్రామీణ రోడ్లు దెబ్బతిని రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

డప్పు కళాకారుడికి అఖండ నంది అవార్డు



అవార్డు అందుకుంటున్న అంబేద్కర్

యాచారం, సెప్టెంబరు 9 : మొండిగౌరెల్లి గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు తాండ్ర అంబేడ్కర్ సోమవారం నగరంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో నేషనల్ అఖండ నంది అవార్డును అందుకున్నారు. నటులు రజిత, శ్రీనివాస్, ఆదివాసి కళాకారుల డైరెక్టర్ శ్రీధర్‌లు అవార్డును ప్రదానం చేశారు. రాష్ట్ర కళా సమితి నిర్వహించిన డప్పు కళాకారుల పోటీలో అంబేద్కర్ ఉత్తమ ప్రదర్శన చేశారు. తనకు అవార్డు రావడం ఆనందంగా ఉందని అంబేద్కర్ అన్నారు.

చిలుక వాగు పరిశీలన



తాండూరు చిలుక వాగు మ్యాప్ ను పరిశీలిస్తున్న పబ్లిక్ హెల్త్ అధికారులు

తాండూరు, సెప్టెంబరు 9: తాండూరు పట్టణంలోని చిలుక వాగును సోమవారం వెస్ట్ సర్కిల్ పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు పరిశీలించారు. తాండూరులో వస్తున్న వరదనీటి మళ్లింపుపై మ్యాప్‌ను పరిశీలించారు. పట్టణంలో ఉన్న నిర్మాణాలకు ఇబ్బంది లేకుండా నీటి మళ్లింపును పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న రూ.16కోట్ల నిధులకు అదనంగా మరో రూ.20కోట్ల నిధులు అవసరమని అంచనా వేసినట్లు సమాచారం. వారివెంట తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, కమిషనర్ విక్రంసింహారెడ్డి, డీఈ మణిపాల్ ఉన్నారు.

కాళోజీ అడుగుజాడల్లో పయనించాలి



ఘట్‌కేసర్: పోచారం మున్సిపల్ కార్యాలయం కాళోజీకి నివాళులర్పిస్తున్న చైర్మన్ తదితరులు



మేడ్చల్ టౌన్: కాళోజీకి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రిదీపిక నర్సింహారెడ్డి

ఘట్‌కేసర్, సెప్టెంబరు 9: ప్రతీ ఒక్కరు కాళోజి నారాయణరావు అడుగు జాడల్లో పయనించాలని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కాళోజి 110వ జయంతి సందర్భంగా సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ తన కవిత్వంతో తెలంగాణ స్వరాష్ట్ర ఆకాంక్షను ప్రజల్లో రగిలించిన గొప్ప కవి కాళోజి నారాయణరావు అని కొనియాడారు. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై అలుపెరుగని పోరాటం చేసిన కవిగా చరిత్రపుటల్లో నిలిచిఉంటారని గుర్తుచేశారు. అంతకు ముందు సాయినగర్ కాలనీలోని వినాయక మండపం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయా కార్యక్రమాలలో వైస్‌చైర్మన్ రెడ్డియా నాయక్, కౌన్సిలర్ సుర్వీ రవీందర్, నాయకులు కెఎంరెడ్డి, శ్రీనివాస్, రాజేశ్వర్‌రెడ్డి, మురళి, వెంకటేశ్వర్లు రాఘవేందర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మూడుచింతలపల్లి: మండలంలోని జగ్గంగూడ గ్రామంలో సోమవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జగ్గంగూడ మాజీ సర్పంచ్ చందుపట్ల విష్ణువర్ధన్‌రెడ్డి కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు జాంగీర్, మహేశ్, శ్రీకాంత్ చెన్నారెడ్డి, శశికాంత్, గ్రామ పంచాయితీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రిదీపిక నర్సిహారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయ మీటింగ్ హాల్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించి కాళోజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్లు జాకట దేవరాజ్, తుడుం గణేష్, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, కొడె మహేష్, జంగ హరికృష్ణ , నాయకులు మర్రి నర్సింహ్మారెడ్డి, మధుకర్ యాదవ్, మల్లేష్ గౌడ్ పాల్గొన్నారు.

శామీర్‌పేట: జగద్గిరిగుట్ట మహిళ డిగ్రీ గురుకుల కళాశాల్లో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చేతన ఆధ్వర్యంలో కాళోజీనారాయణరావు జయంతి వేడుకలను అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజి నారాయణరావు చిత్రపటానికి వైఎస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు హర్షిత, మేఘాశ్రవంతి, ధనవేణి, తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వికారాబాద్ జిల్లాలో..

వికారాబాద్: తెలంగాణ బాషా దినోత్సవాన్ని వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ గీతా, అధ్యాపకులు కాళోజీ నారాయణరావు జయంతి పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సంతోష, రాధిక, సక్రీం, సుజాత, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: కాళోజీ నారాయణరావు తన సాహిత్యం ద్వారా ప్రజల్లో చైతన్యం కలిగిస్తూ అణిచివేతకు ఎదురు తిరిగిన గొప్పవ్యక్తి కాళోజీ అని కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టి.రాంబాబు అన్నారు. కళాశాలలో సోమవారం తెలంగాణ భాషాదినోత్సవాన్ని పురస్కరించుకుని కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమలాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బి.మోహన్, బి.నర్సింహులు, రమేష్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: దుద్యాల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో కాళోజీ నారాయణరావు జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్, మాట్లాడుతూ తెలంగాణ యాస, భాషపై అత్యంత ధృడమైన విధానాన్ని వ్యక్తపర్చిన వ్యక్తి కాళోజీ అని కొనియాడారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మల్లప్ప, రాములు, సుధాకర్, రాహుల్, చందర్‌నాయక్, శ్రీనివాస్, ముకుందరెడ్డి, రవి, వహీద్, సాలిబాయి పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: అనంతసాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో అధ్యక్షుడు బి.నర్సింహులుగుప్త సోమవారం కాళోజీ జయంతి సందర్భంగా తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు నవాబురాచిరెడ్డిని శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కవులు గంట మనోహర్‌రెడ్డి, దురేటి ఆశీర్వాదం, రావూస్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



వికారాబాద్: కాళోజీ చిత్ర పటానికి పూల వేసి నివాళులర్పిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గీతా

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

వికారాబాద్, సెప్టెంబరు 9: మద్యం మత్తులో బైక్ నడపడంతో ఎదురెదురుగా బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. ఈ ఘటన వికారాబాద్ మునిసిపల్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కర్ణాటకకు చెందిన ప్రశాంత్ నవాబుపేట మండలం పూలపల్లి గ్రామంలో నాలుగు సంవత్సరాలుగా కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తూ తన భార్య రూమ(32)తో కలిసి జీవిస్తున్నాడు. సోమవారం సాయంత్రం పూలపల్లి నుంచి వికారాబాద్ వస్తుండగా రైల్వే స్టేషన్ సమీపంలోని ధన్నారం వెళ్లే శ్మశాన వాటిక వద్ద వికారాబాద్ నుంచి కోటాలగూడ వైపు వెళుతున్న బైక్ వేగంగా ఢీకొట్టింది. దీంతో ప్రశాంత్ బైక్‌తో పాటు పాతూరుకు చెందిన శ్రీనివాస్ బైక్‌ను అదే సమయంలో ఢీ కొట్టడంతో ప్రశాంత్ భార్య రూమ కిందపడి అక్కడికక్కడే మృతిచెందింది. మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

తాండూరు రూరల్, సెప్టెంబరు 9: ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన తాండూరు మండలం మిట్టబాస్పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మిట్టబాస్పల్లి గ్రామానికి చెందిన అత్కూర్ రాంచందర్ వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండు సంవత్సరాలుగా పంటలు సరిగ్గా పండటం లేదని తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడు. ఈక్రమంలో గతనెల 17వ తేదీన రాత్రి రాంచందర్ కాళ్లకు, చేతులు, వీపుపై కాలిన గాయాలతో ఇంటికి వచ్చాడు. కుటుంబీకులు గాయాలు ఎలా అయ్యాయని ఆరా తీయగా తన పొలం పక్కన ఉన్న రైల్వే స్తంభానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించానని, కరెంటు షాక్ కొట్టడంతో ఈ గాయాలయ్యాయని తెలిపాడు. కుటుంబీకులు వెంటనే రాంచందర్‌ను హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడి భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

ప్రజలకు సేవచేసే ఉద్దేశం లేకుంటే వెళ్లిపోండి

● ఎంపీడీవోను మందలించిన ఎమ్మెల్యే



మంబాపూర్ గ్రామం నుంచి ఎంపీడీవోకు ఫోన్‌చేసి మందలిస్తున్న ఎమ్మెల్యే

పెద్దేముల్, సెప్టెంబరు 9: "ప్రజలకు సేవచేసే ఉద్దేశం మీకుందా? లేదా? అలాంటి ఉద్దేశం లేకుంటే వెళ్లిపోండి.." అని ఎంపీడీవో జర్నప్పను తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి మందలించారు. మండలంలోని ఖానాపూర్ గ్రామంలో నెలరోజులుగా తాగునీటి సమస్య ఉందని, అధికారులకు చెప్పినా సమస్యను తీర్చడం లేదని గ్రామస్థులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే ఎంపీడీవోకు సోమవారం ఫోన్‌చేసి మాట్లాడారు. ఖానాపూర్‌లో నెలరోజుల నుండి తాగునీటి సమస్య ఉంటే మీరేం చేస్తున్నారని ప్రశ్నించారు. ప్రజలకు సమస్య వచ్చినపుడు తీర్చలేకపోతే మీరెందుకున్నట్లు అని అసహనం వ్యక్తం చేశారు. పనిచేసే ఉద్దేశం ఉంటే ఇక్కడ పనిచేయండి. లేదంటే ఇంకెక్కడికైనా వెళ్లిపోండని మండిపడ్డారు. సర్పంచులు లేకపోవడం వల్ల ఇప్పుడు నేరుగా ప్రజలతో కలిసిపోయే అవకాశం ఉందని, మీరు పనిచేస్తే మిమ్మల్ని జనాలు ఎప్పటి గుర్తుపెట్టుకుంటారని అన్నారు. నిధులు కావాలంటే తనను అడగండని చెప్పారు. సమస్యలు చెబితే వాటిని తీర్చకుండా సాకులు చెబితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం



సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ యూనిట్‌ను పరిశీలిస్తున్న ఎస్ఐ గఫార్

బషీరాబాద్, సెప్టెంబరు 9: నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకంగా వ్యవహరిస్తాయని బషీరాబాద్ ఎస్ఐ ఎంఏ గఫార్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ యూనిట్‌ను ఎస్ఐ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ విలేకర్లతో మట్లాడుతూ బషీరాబాద్‌లోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన 32సీసీ కెమెరాలతో నిరంతరం నిఘాపెట్టి పరిశీలిస్తున్నామని ఆయన వెల్లడించారు. వీటిలో కొన్నింటికి మరమ్మతులు చేయించి అందుబాటులోకి తెచ్చామన్నారు. సీసీ కెమెరాలను పోలీస్‌స్టేషన్‌లోని కమాండ్ కంట్రోల్ యూనిట్‌కు అనుసంధానం చేయడం పట్ల అనునిత్యం పర్యవేక్షిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో ఇప్పటికే 85 వరకు సీసీ కెమెరాలు ఉండగా, పలు గ్రామాల్లో చిన్న, చిన్న మరమ్మత్తులతో సరిగా పని చేయడంలేదని దృష్టికి వచ్చిందన్నారు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించి త్వరలో సీసీ కెమెరాలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. వ్యాపారులు దుకాణ సమూదాయల వద్ద స్వతహాగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

మహిళల భద్రతకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాం

వికారాబాద్: మహిళల భద్రతకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సోమవారం షీ టీమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమం ద్వారా 450 మంది విద్యార్థులకు షీ టీమ్, టీ-సేఫ్ ప్రాధాన్యతను, డయల్ 100, 181, 1098, సైబర్ నేరాల నివారణకు 1930 వంటి హెల్ప్ లైన్లపై అవగాహన కల్పించారు. అదేవిధంగా యాంటీ ర్యాగింగ్ చట్టం, సీసీ కెమెరాలు, రోడ్డు భద్రత వంటి అంశాలను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, షీటీమ్ సభ్యులు బుచేందర్‌రెడ్డి, రేష్మా, కళాజాత బృందం పాల్గొన్నారు.

రజకుల స్థలంలో నిర్మాణాలు నిలిపివేయాలి

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 9: మున్సిపల్ పరిధిలోని తుమ్మ చెరువు సమీపంలో రజక సంఘం కోసం ప్రభుత్వం కేటాయించిన స్థలంలో కొందరు నిర్మాణాలు చేపట్టి కబ్జాకు పాల్పడుతున్నారని, వాటిని నిలిపివేయాలని స్థానిక రజక సంఘం నాయకులు సోమవారం మేడ్చల్ కమిషనర్ నాగిరెడ్డికి ఫిర్యాదు చేశారు. తుమ్మ చెరువులో రజకుల కోసం ప్రభుత్వ దోబి ఘాట్ ఏర్పాటు చేసి ఇవ్వటంతో పాటు రజక సంఘం భవనం నిర్మించుకోవడానికి ప్రభుత్వం స్థలాన్ని కేటాయించగా కొందరు అట్టి స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టి కబ్జాకు పాల్పడుతున్నారని రజకులు తెలిపారు. అక్రమంగా కబ్జాదారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

భారీ వర్షాలకు కూలిన 19 ఇళ్లు

బషీరాబాద్, సెప్టెంబరు 9: భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా 19 ఇళ్లు కూలిపోయినట్లు బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ సోమవారం తెలిపారు. మంతన్‌గౌడ్‌లో 1, కొత్లాపూర్(బి)లో 2, కొర్విచెడ్‌లో 1, కంసాన్‌పల్లి(బి)లో 1, మర్పల్లిలో 1, మైల్వార్‌లో 4, హ్యాంకానాయక్‌తండాలో 1, ఎక్మాయిలో 1, గొట్టిగకలాన్‌లో 2, కంసాన్‌పల్లి(ఎం)లో 2, జీవన్గిలో 1, జలాల్‌పూర్‌లో 1, బద్లాపూర్‌తండాలో ఒక ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఇల్లు కూలిన బాధితుల రిపోర్టును కలెక్టరేట్‌లో ఆన్‌లైన్ ద్వారా పంపించనున్నట్లు తెలిపారు.

పట్టుదలతో ముందుకు సాగితే ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న నల్ల మల్లారెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 9: పట్టుదలతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని నల్ల మల్లారెడ్డి విద్యా సంస్థల చైర్మన్ నల్ల మల్లారెడ్డి తెలిపారు. కాచవానిసింగారం, దివ్యానగర్‌లోని నల్ల మల్లారెడ్డి ఇంజనీరింగు కళాశాలలో సోమవారం జరిగిన ఓరియెంటేషన్ ప్రోగ్రాంకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంగ్ల భాషాపై పట్టుసాధించాలని, విషయపరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాలలో యాంటీ ర్యాగింగ్ టీం చురుకుగా పనిచేస్తోందన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నల్ల దివ్య, నల్ల మల్లారెడ్డి స్కూల్ డైరెక్టర్ నల్ల స్నేహ, ప్రిన్సిపాల్ ఎంఎస్వీ రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డీసీసీబీ వైస్ చైర్మన్‌కు సన్మానం



రవిగౌడ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు, సెప్టెంబరు 9: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి వైస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన తాండూరు మండల వాసి రవీందర్‌గౌడ్‌ను తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సోమవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో సన్మానించారు.

టీపీసీసీ చీఫ్‌ను కలిసిన రఘువీరారెడ్డి



మహేష్‌కుమార్ గౌడ్‌కు అభినందనలు తెలుపుతున్న రఘువీరారెడ్డి

ధారూరు, సెప్టెంబరు 9: టీపీసీసీ నూతన అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి. రఘువీరారెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పీసీసీ చీఫ్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



పరిగిలో సైడ్ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

పరిగి, సెప్టెంబరు 9: పరిగి పట్టణంలోని 11వ వార్డు మార్కెట్ రోడ్డులో సీసీ, అండర్ డ్రైనేజీ పనులను మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిగి పట్టణంలోని గంజ్ ఏరియాలో దుకాణాల సముదాయానికి ఇబ్బందులు ఏర్పడటంతో డ్రైనేజీ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు నాగేశ్వర్, ఎర్రగడ్డ కృష్ణ, మునీర్ పాల్గొన్నారు.

సెప్టెంబరు 11న ప్రజావాణి

వికారాబాద్, సెప్టెంబరు 9: మహాత్మా జ్యోతిబాపూలే హైదరాబాద్ ప్రజాభవన్‌లో ప్రతీ శుక్రవారం, మంగళవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ఈనెల 11కు వాయిదావేసినట్లు ప్రజాపాలన ప్రత్యేకాధికారి దివ్య దేవరాజన్ తెలిపినట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు(మంగళవారం) ప్రజాభవన్‌లో 16వ కేంద్ర ఆర్థిక సంఘంతో ముఖ్యమైన సమావేశం జరుగుతున్న నేపథ్యంలో ప్రజావాణిని బుధవారానికి మార్చినట్లు తెలిపారు.

ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి

కులకచర్ల, సెప్టెంబరు 9: ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్.ఆంజనేయులు అన్నారు. మండలంలోని ముజాహిద్‌పూర్ గ్రామ హనుమాన్ ఆలయ వినాయక మండపం దగ్గర సోమవారం పరిగి ఆర్టీసీ డిపో డీఎం కరుణశ్రీ ఆదేశాలతో ప్రజలకు ఆర్టీసీ సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు. గమ్యం ఆఫ్ కార్గో, లాగిస్ట్, పెళ్లిలకు, విహార యాత్రలకు అద్దె బస్సుల సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారి చంద్రయ్య, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు సర్ఫుద్దీన్, స్థానికులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 9: మేడ్చల్ మున్సిపల్ 3వ వార్డుకు చెందిన పలువురు లబ్ధిదారులకు స్థానిక కౌన్సిలర్ జాకట దేవరాజ్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. తనవార్డులో అవసరమున్న ప్రతీ ఒక్కరికి సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థికసాయం అందేలా కృషిచేస్తానని ఈ సందర్భంగా దేవరాజ్ తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

మర్పల్లి, సెప్టెంబరు 9: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని మండల విద్యాధికారి విద్యాసాగర్ అన్నారు. మండల కేంద్రంలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులను సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు జన్మనిస్తే ఉపాధ్యాయులు విజ్ఞానాన్ని ప్రసాదించి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజమల్లయ్య, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనానికి ప్రత్యేక చర్యలు



పరిగి: లక్నాపూర్ ప్రాజెక్టులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి

పరిగి, సెప్టెంబరు 9:గణేశ్ నిమజ్జనానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి తెలిపారు. లక్నాపూర్ ప్రాజెక్టులో వినాయక నిమజ్జనం ఏర్పాట్లను సోమవారం రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్లు కృష్ణ, నాగేశ్వర్, మునీర్, మల్లేశ్‌యాదవ్, మున్సిపల్ సిబ్బంది వినోద్ పాల్గొన్నారు.

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని గొల్ల కుంట దగ్గర వినాయక నిమజ్జన ఏర్పాట్లను సోమవారం తహసీల్దార్ విజయ్‌కుమార్, సీఐ శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసు నిబంధనల మేరకు నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, ఎస్ఐ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: ప్రతీ ఒక్కరు సామరస్యంగా వ్యవహరించిన నాడే సంపూర్ణంగా శాంతి భద్రతలు నెలకొంటాయని మేడ్చల్ సీఐ సత్యనారాయణ అన్నారు. మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో మేడ్చల్ పట్టణ ముస్లిం పెద్దలతో సీఐ పీస్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ముస్లిం పెద్దలు ఆగజాని, సయ్యద్ లాయక్ అలీ, ఎండి.రఫీక్, సయ్యద్ ఇనాయత్ అలీ పాల్గొన్నారు.

గణపయ్యకు ప్రత్యేకపూజలు

ఘట్‌కేసర్ రూరల్: వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సోమవారం మూడవరోజు గణపయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాలలోని వినాయక మండపాల వద్ద వినాయకుడికి ప్రత్యేకపూజలు చేశారు. పలు వినాయక మండపాల వద్ద అన్నదానం చేశారు. అవుశాపూర్‌లో జరిగిన కార్యక్రమంలో భక్తులు కవాడి వామన్‌రెడ్డి, మాదవరెడ్డి, కృష్ణారెడ్డి, మాజీ వార్డుసభ్యురాలు కవాడి శిరీష వామన్‌రెడ్డి పాల్గొన్నారు.

మేడ్చల్ టౌన్: మేడ్చల్ మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలోని మండపంలో ప్రతిష్టించి వినాయకునికి సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రిదీపిక నర్సింహారెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బందితో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు మర్రి శ్రీనివాస్ రెడ్డి, జంగ హరికృష్ణ, నాయకులు మర్రి నర్సింహారెడ్డి, మల్లేష్ గౌడ్, శ్రవణ్ గుప్త, మధుకర్ యావ్ తదితరులు పాల్గొన్నారు.



కొడంగల్: వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



ఘట్‌కేసర్ రూరల్: అవుశాపూర్‌లో గణపయ్యకు పూజలు చేస్తున్న భక్తులు

ఎవరికి వారే యమునా తీరే

● ప్రజావాణిలో అధికారుల తీరుపై విమర్శలు



ప్రజావాణిలో ఫిర్యాదు అందజేస్తున్న ప్రజలు

పెద్దేముల్, సెప్టెంబరు 9: ఎవరికి వారే యమునాతీరే అన్నట్లుగా మారింది పెద్దేముల్ మండల అధికారుల తీరు. మండలంలో ప్రజావాణి కొనసాగుతున్న తీరుచూస్తే ఇది స్పష్టంగా అర్థమవుతుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతీ సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో ప్రజావాణి కొనసాగుతుంది. ప్రజావాణికి అన్నిశాఖల నుంచి మండలస్థాయి అధికారి హాజరు కావాలి. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు అక్కడే ఉండి ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను స్వీకరించాలి. ఆయా సమస్యల పరిష్కారం దిశగా కృషి చేయాలి. కానీ పెద్దేముల్ మండలంలో ప్రజావాణిని మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. అధికారుల వద్ద జవాబుదారి తనం అస్సలు కనిపించడం లేదు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయి. ఎన్ని పరిష్కారమయ్యాయని ప్రజావాణి నిర్వహించే ఎంపీడీవోను విలేకరులు అడిగితే ఆయన సమాధానం చెప్పలేకపోతున్నారు. ఏశాఖ సమస్యలు ఉంటే ఆశాఖ అధికారి ప్రజల నుంచి ధరఖాస్తులు తీసుకుంటున్నారని, ఆ సమస్య పరిష్కారం అయ్యిందా లేదా? అనే విషయం మావద్ద ఉండదని చెబుతున్నారు. కలెక్టర్ అడిగితే సమాధానం చెప్పడానికి మీవద్ద సమాచారం ఉండాలి కదా అని ప్రశ్నిస్తే కలెక్టర్ అడిగినపుడు తాము చెప్పుకుంటామని సమాధానమివ్వడం గమనార్హం. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మూడు దరఖాస్తులు వచ్చినా వాటిని రిజిష్టర్‌లో నమోదు చేయలేదు. అవి తహసీల్దార్‌కు సంబంధించినవని, ఇళ్లు కూలిపోయిన వారి వివరాలు రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు కాబట్టి ఆ ఫిర్యాదులు తాము నమోదు చేయలేదని అధికారులు చెబుతున్నారు. మరోవైపు అధికారులు సమయ పాలన పాటించడంలేదు. ప్రజావాణికి రాని అధికారులపై చర్యలు ఏమైనా ఉంటాయా అని అడిగితే కలెక్టర్ అడిగినపుడు తాము ఆయా అధికారుల హాజరుపట్టికను పంపిస్తామని ఎంపీడీవో తెలిపారు. ఇప్పటికైనా ప్రజావాణి సక్రమంగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

సస్యరక్షణ పద్ధతులతో లాభాలు



రైతులతో వ్యవసాయ కళాశాల ఫైనలియర్ విద్యార్థులు

యాలాల, సెప్టెంబర్ 9: వర్షాల కారణంగా దెబ్బతిన్న, పత్తి వరి పంట పొలాల్లో సస్యరక్షణ పద్ధతులు పాటించి లాభాలు పొందవచ్చని తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఫైనలియర్ విద్యార్థులు సూచించారు. మండల పరిధిలోని రాఘవపూర్ గ్రామంలో సోమవారం రైతులతో అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తాండూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం కోఆర్డినేటర్ లక్ష్మణ్, శాస్త్రవేత్త యమున మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు పాటించి పంటలను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాలెం వ్యవసాయ విశ్వ విద్యాలయం ఫైనలియర్ విద్యార్థులు రాకేష్, సాయికుమార్, రాజు, జయప్రకాష్, రాఘవపూర్, వెంకటయ్య పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● **కీసర రూరల్:** నాగారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధి మూడవ వార్డు గోకుల్‌నగర్ కాలనీలో సోమవారం రూ.10లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ గోక కళావతి పాల్గొన్నారు.

● **కులకచర్ల:** మండలంలోని చాపల గూడెం గ్రామానికి చెందిన సాయమ్మ(70) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులు సోమవారం బాధిత కుటుంబానికి మృతురాలి అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ పేర్కంపల్లి మొగులయ్య, చిట్టెల ఎంకప్ప, గాదె వెంకటయ్య, గండి భీమయ్య, గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మయ్య ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

● **తాండూరు:** వెనుకబడి ఉన్న మా వార్డు అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని 14వ వార్డు కౌన్సిలర్ బోంబినా కోరారు. హైదరాబాద్ నగరంలో సోమవారం ఎమ్మెల్యే నివాసంలో కలిశారు. రోడ్లు, కల్వర్టు, మరుగు కాల్వలు, బాలికల హైస్కూల్ కంపౌండ్ నిర్మాణానికి అవసరమైన నిధులను ఎమ్మెల్యే ఫండ్స్ నుంచి మంజూరు చేయాలని కౌన్సిలర్ కోరారు. పాత తాండూరులో పూర్తిగా వెనుకబడిన వార్డు అయినందున అభివృద్ధికి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని ఆమె కోరారు.

● **బొంరాస్‌పేట్:** మండలంలోని పూర్యానాయక్ తండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్‌ను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి చేయూతను అందించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **ఘట్‌కేసర్ రూరల్:** ఖమ్మం వరద బాధితులకు వైఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి నిత్యవసర సరుకులు అందజేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మున్నేరు నది ప్రకోపానికి బలైన కుటుంబాలకు సోమవారం ఆయన అవుశాపూర్ నుంచి డీసీఎంలో ఖమ్మంకు బియ్యం, బెడ్‌లు, కూరగాయాలు తదితర సరుకులను తీసుకెళ్లారు. సరుకులను వరద బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏనుగు మశ్చేందర్‌రెడ్డి, వైఎస్సార్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

● **వికారాబాద్:** ఈనెల 12 సాయంత్రం 4గంటలకు స్థానిక శ్రీరామమందిరంలో వినాయకనిమజ్జనం ఉత్సవాలపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు హిందూ ఉత్సవ సమితి కన్వీనర్ కృష్ణ పంతులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● **బొంరాస్‌పేట్:** మండలంలోని దుప్‌చర్ల గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 30 ట్రాక్టర్‌ల ఇసుకను బుధవారం ఉదయం 11 గంటలకు గ్రామంలో వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ పద్మావతి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సీజ్ చేసిన ఇసుక టన్నుకు రూ.600 చొప్పున వేలం నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

● **పరిగి:** వరద బాధితుల కోసం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం పరిగి పట్టణంలో విరాళాలు సేకరించారు. ఒక రోజు రూ.6663 విరాళాలు సేకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మంగమ్మ, తిరుమలయ్య, చంద్రకళ, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.